క్లుప్తంగా

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్యలో ప్రభుత్వం తీసుకు వస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం పది గంటలకు వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, ,శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న తాలుకా కేంద్రాల వద్ద నిరసనలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హియరింగ్ కేర్‌పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: నిహార్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హియరింగ్ హెల్త్‌పై బుధవారం అవగాహన కల్పించారు. హియర్జాప్ హియరింగ్ సొల్యూషన్స్ సహకారంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వినికిడి సమస్యలను ముందస్తుగా గుర్తించడం, సమర్థవంతంగా నిర్వహించడంపై దృష్టి సారించడం వంటివి వివరించారు. 60 మందికి ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ మహమ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల్లో గుబులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి ప్రభుత్వంపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపణలు చేస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై చేసిన ఆరోపణలను పార్టీ ఖండిస్తోందన్నారు. ఆదినారాయణరెడ్డి కుటుంబానికి దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రాజకీయ జీవితం ప్రసాదించారని గుర్తుచేశారు. అలాంటి పార్టీ తుడిచి పెట్టుకుపోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదన్నారు. సమావేశంలో చిన్న కుళ్లాయప్ప, మయాన రహంతుల్లాఖాన్, కమల్‌బాషా, హమీద్, గౌరీదేవి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఓబుల్‌రెడ్డి కుటుంబీకులు

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరంలోని స్నేహలత వృద్ధాశ్రమం సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని అనాథ విద్యార్థులకు బుధవారం అన్నదానం చేశారు. తన సతీమణి లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ ఓబుల్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరుడికి పూజలు

కడప కల్చరల్: కడప గడ్డి బజారులోని సోమసుందరేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు చంద్రమౌళిశర్మ రుద్రాభిషేకం, గణపతిపూజ, నవగ్రహ మంటపారాధన పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పిడతల గోపాల్, వారణాసి శ్రీధర్, శశిధర్‌శర్మ, జగదీష్ స్వామి, నరసింహ బట్టర్, సురేష్‌శర్మ, చరణ్, కిషోర్‌పాల్గొన్నారు.

యోగాతో అర్యోగ్యం


యోగాసనాలు అభ్యసిస్తున్న మహిళలు

కడప కల్చరల్: యోగా ద్వారా మానసిక ఆరోగ్యం కలుగుతుందని వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు భారతి తెలిపారు. కేంద్ర గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బుధవారం యోగాసనాలు నేర్పారు. భారతి మాట్లాడుతూ యోగాతో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తగ్గుతాయని, ఏకాగ్రత పెరిగి మెదడు చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. అనంతరం మూఢ నమ్మకాలు–సైన్స్ మేజిక్ చేయడంలో మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, జేమ్స్, రమణ, సుబ్బమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాంబ జయంతి


అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్: ఉదయం నకాష్‌లోని పాండురంగస్వామి ఆలయంలో వాసవీ కన్యకాంబ జయంతి బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 102 కన్యకలు క్షీర కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని అభిషేకించారు. ఆర్య వైశ్య ప్రముఖులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రమ...అదే మన శక్తి




శ్రమ శక్తికి మించిన సంపద లేదంటారు పెద్దలు. ఈ ఫొటోల్లోని హమాలీలు 50 కిలోల బియ్యం మూటలను అలవోకగా లారీల్లో ఎక్కిస్తున్నారు. గూడ్స్ రైలులోని మూటలను ఒడుపుగా ఎత్తుకొని లారీ నుంచి రైలులోకి వేసిన నిచ్చెన మీద నడుచుకుంటూ వెళ్లడం సామాన్యమైన విషయం కాదు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం జరుగక తప్పదు. అది వారి వృత్తి అయినప్పటికీ వీరి శ్రమశక్తి పలువురికీ స్ఫూర్తినిస్తుందనడలో సందేహం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాల ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ పేర్కొన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో వివిధ కార్మిక సంఘాల సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను యావత్ కార్మికవర్గం సమ్మె ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉందని తెలిపారు. హైర్ – ఫైర్, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, అప్రెంటిస్ విధానాలతో కార్మికుల శ్రమ దోపిడీ జరిగే అవకాశముందని గుర్తు చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలకు విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారుల కోసమేనని విమర్శించారు. 10వ తేదీ లోపు యాజమాన్యాలు, అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, మే11న జిల్లా విస్తృత స్థాయి సమ్మె సదస్సు, 15న రౌండ్ టేబుల్ సమావేశం 17, 18వ తేదీలలోస్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జి.వేణుగోపాల్, కె.శ్రీనివాసులురెడ్డి, కె.మల్లికార్జునరెడ్డి, కేసీ.బాదుల్లా పి.సుబ్బరాయుడు, యు.మద్దిలేటి, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, తారక రామారావు, మేలింగి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కడప ఎడ్యుకేషన్: ఆన్‌లైన్ ద్వారా జరిగే సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. తెలుగు గంగ కాలనీలోని వేసవి శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ అభ్యర్థులకు బుధవారం సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరిగే మోసాలపై అవగాహన ఉండాలన్నారు. మహిళా ఇన్స్‌పెక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు కఠినమైన చట్టాలు వర్తిస్తాయని, తద్వారా విలువైన జీవితం కోల్పోతారని పేర్కొన్నారు. చదువు కోసం బాల్యాన్ని వెచ్చించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్‌జే.ఆత్రే, డాక్టర్ నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, అనిల్ కుమార్, రూపేంద్రజిత్‌సింగ్, సీఎల్.రెడ్డి, కొండారెడ్డి, డేవిడ్, ఉమా, మల్లేశ్వరి పాల్గొన్నారు.

నేడు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం

కడప కల్చరల్: ప్రపంచ రెడ్‌క్రాస్ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని మట్టిపెద్దపులి వీధిలో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యులు, రెడ్‌క్రాస్ వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

టీకాలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని నాగరాజుపేట యూహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద బుధవారం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణిగా నమోదు చేసుకున్న వెంటనే టీటీ ఇంజెక్షన్ వేయించాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు ఇస్తే వ్యాధి నిరోధకత పెరిగి ప్రాణంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ప్రియ, డాక్టర్. ముస్కాన్, డాక్టర్.సోను తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు శోచనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా అధికారుల తీరులో మార్పు రాలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిలి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. కడప బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత పాలన ప్రజలకు అందించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కూటమి ప్రభావితం వచ్చినా అధికారుల తీరు మారలేదన్నారు. యూసీఐఎల్ టెండర్లలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలన్నారు. 1000 కోట్లకు పైగా పనిచేసిన స్వస్తిక్, శివసాయి కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మన విజయ్, లక్ష్మణ్‌రావు, ప్రవీణ్‌నాయుడు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి

కడప ఎడ్యుకేషన్: బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమీవుల్లా, మనోజ్, మహేష్, జగదీశ్వర్‌రెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

12న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా


లే అవుట్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగర పరిధిలోని చెర్లోపల్లి లే అవుట్ పరిధిలో నివాసముంటున్న ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 12న ధర్నా చేపట్టినట్లు సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నగరంలోని చెర్లోపల్లి లేఅవుట్‌లో బుధవారం సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ పరిధిలో 500 మందికి ఉపయోగపడే ప్రధాన రహదారి లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ప్రధాన రహదారి లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవిందు, నరసింహ, వెంకటసుబ్బయ్య, వెంకటరెడ్డి రామకృష్ణారెడ్డి, బాషా, రవిశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి గ్రామోత్సవం


పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

కడప సెవెన్ రోడ్స్: కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కడప నగరంలోని మున్సిపల్ మైదానం వద్ద, బిల్టప్ సమీపంలోని ఆచార్యుల కాలనీ, దేవుని కడప వద్దగల బ్రహ్మంగారి ఆలయాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మాతా గోవిందమాంబ సమేత బ్రహ్మంగారికి గంగ పంచామృతం, క్షీరం, ఫలోదకాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేసి . సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి నైవేద్యం, మంత్రపుష్పం, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అన్న ప్రసాద పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ దీక్ష


దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో 24 గంటల నిరాహార దీక్ష బుధవారం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు. కె.శ్రీనివాసులురెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ కడప కార్పొరేషన్‌లో సుమారు 42 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండాయనే పేరుతో తొలగించడం సరికాదన్నారు. కార్మికులకు ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వకుండా పంపడం అన్యాయమన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. మాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 8న కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 24 గంటల దీక్షలో ఎరుకలమ్మ, అచ్చమ్మ, నరసమ్మ, అంతోనమ్మ, దానమ్మ, కొండయ్య, వెంకటయ్య, ఆనందరావు, అచ్చయ్య, ఆంజనయులు, శ్రీనివాసులు, మోషే, వెంకట చేలపతి, పెంచలయ్య, ఈశ్వరయ్య కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కమిటీ సభ్యులు ఎస్.కిరణ్, వి. శ్రీధర్‌బాబు, పెంచలమ్మ, ధరణి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పరిశోధనలకు నిలయం గ్రంథాలయం


డాక్టర్ చెల్లప్పను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ అమూల్య సాహిత్య, చారిత్రక సంపదను తెప్పిస్తే తెలుగు పరిశోధకులకు నిలయంగా బ్రౌన్ గ్రంథాలయం నిలుసుతందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నార్నరు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయన తాళపత్ర గ్రంథాలు, తామ్రపత్రం, చేతితో తయారు చేసిన కాగితాలు, బ్రౌన్ రచనలు, మెకెంజీ కైఫియత్తులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాను గతంలో గ్రంథాలయాన్ని సందర్శించానని, ఇప్పుడు చాలా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. తమిళనాడులో తెలుగువారి అమూల్య సాహిత్య, చారిత్రక సంపద ఉందని, దానిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించమని కోరుతూ 2012లో లేఖ రాశానని తెలిపారు. వాటిని తెప్పించాలని కోరారు. అనంతరం చెల్లప్పను బ్రౌన్ కేంద్రం నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ్‌భాస్కర్, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, ఎన్.రమేశ్‌రావు, ఆర్. వెంకటరమణ, సఫ్దర్ హుస్సేన్, బాలనాయుడు, బి.హరికృష్ణ, పి.అరుణ కుమారి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి


ఇన్‌ఛార్జి డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న శివకుమార్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆనందానికి అడ్డు వేసేలా ఉందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి డీఆర్‌ఓను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏడేళ్ల తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి.. పరీక్షలకు సన్నద్ధం కావడానికి 90 రోజుల గడువు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. తెలంగాణ ప్రభుత్వం 47 ఏళ్ల వరకు ఉద్యోగాలకు సన్నద్ధమవడానికి వయోపరిమితి పెంచిందని, రాష్ట్ర ప్రభుత్వం 49 సంవత్సరాల వరకు అవకాశం కల్పించాలని కోరుతున్నామన్నారు. నార్మలైజేషన్ రద్దుచేసి జిల్లాకు ఒకే పేపర్ నిర్వహించాలని కోరారు. ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో 40 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, నగర నాయకులు పాల్గొన్నారు.

ఐఈఆర్పీలకు న్యాయం చేయాలి


రఘునాథరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఐఈఆర్పీలు


కడప ఎడ్యుకేషన్: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఈఆర్పీలుగా పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహ రెడ్డి కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డిని బుధవారం ఐఈఆర్పీలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను స్పెషల్ డీఎస్సీ పోస్టులలో విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పిల్లిరమణా రెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఎస్టీయూ జిల్లా నాయకులు మహబూబ్‌బాషా, ఫక్రుద్దీన్, గంగులప్ప, రాజారెడ్డి, సిద్ధారెడ్డి, దొరస్వామి, సునీల్, రవికుమార్, అర్షద్ , కరుణాకర్, శ్రీదేవి, మమత, లక్ష్మి ప్రసన్న, అలివేలమ్మ పాల్గొన్నారు.

రిమ్స్ ప్రిన్సిపల్‌కు ఘన సత్కారం


డాక్టర్ సురేఖను సన్మానిస్తున్న సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల రిమ్స్ ప్రిన్సిపల్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న డాక్టర్ సురేఖకు తోటి సిబ్బంది బుధవారం ఘన వీడ్కోలు పలికారు. 2022 అక్టోబరులో అదనపు బాధ్యతలతో రిమ్స్ ప్రిన్సిపల్‌గా వచ్చిన డాక్టర్ ఎ.సురేఖ.. 2023 సెప్టెంబర్ నుంచి అడిషనల్ డీఎంఈ హోదాలో విధులు నిర్వర్తించారు. ఈమెను నంద్యాలకు బదిలీ చేసి.. ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.జమునను కడప వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవీ.రమాదేవి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు, రిమ్స్ వైద్యులు, విద్యార్థులు సురేఖకు శాలువా కప్పి, పూల బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ నాగ శ్రీలత, డాక్టర్ వాణి, ఎల్.శ్రీనివాసరావు, శేఖర్, బాలనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి


పోస్టుకార్డులతో నిరసన

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలుచేయాలని ఉపాధ్యాయుల ఫోరం కడప జిల్లా అధ్యక్షుడు గుజ్జల తిరుపాల్, ప్రధాన కార్యదర్శి కావేటి ఉదయ భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పోస్టుకార్డుల ద్వారా తమ వినతులను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారాలోకేష్‌లకు పంపారు. వారు మాట్లాడుతూ ఓపీఎస్ అమలుచేయకపోతే రాబోయే కాలంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఉద్యమం చేపడతామన్నారు. వీరికి పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరుశివారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెంమహేష్‌బాబు, ఆపస్ రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి తమ మద్దతు ప్రకటించారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి


సంజీవయ్య చిత్రపటం వద్ద నాయకుల నివాళి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దామోదరం సంజీవయ్య సేవలు ఎన్నటికీ మరువ లేనివని డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ ప్రసాద్ అన్నారు. దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరా భవన్‌లో బుధవారం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ తొలి దళిత ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా సంజీవయ్య పనిచేశారన్నారు. వితంతువుల పెన్షన్ పథకం, అవినీతి నిరోధక శాఖ వ్యవస్థను పరిచయం చేసిన నాయకుడు సంజీవయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌గౌస్‌పీర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు ముబారక్, గంగయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయం పనులు చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్: కడప ఎర్రముక్కపల్లెలో గ్రంథాలయ పనులను వెంటనే చేపట్టాలని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జూపముద్ది విజయ భాస్కర్ కోరారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తుల చొరవతో 2023లో రూ.3.60 కోట్ల నిధులు గ్రంథాలయానికి విడుదల చేశారని, టెండర్లు పూర్తయి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తే నిర్మాణ వ్యయం పెరుగుతుందన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ నడుస్తున్న ప్లే స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ నగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఓంశాంతి నగర్‌లోని ఏఐఎస్‌బీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్లే స్కూల్ పేరుతో యాజమాన్యాల తీరుపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి


ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది


రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అధ్యాపకుల నివాళి

కడప ఎడ్యుకేషన్: రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతిని నగరంలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ అధ్యాపకులు రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోబెల్ బహుమతి పొందిన మహాకవి, తాత్వికుడు, కళాకారుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని కొనియడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కడప కల్చరల్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లో మానవత్వం, ప్రేమతత్వం ఉంటాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా అన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమీర్‌బాషా మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. పవన్, బాబ్జి, సుబ్రహ్మణ్యం, శేఖర్, రమణ, సుబ్బమ్మ పాల్గొన్నారు.